18న తిరుప్పూర్ జిల్లాకు ప్రధాని

● అన్నామలై పాదయాత్ర ముగింపు సభలో ప్రసంగం



పెరంబూర్, జనవరి 30: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 'ఎన్ మన్...ఎన్ మక్కల్' పేరుతో చేపట్టిన పాదయాత్ర ముగింపు సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 18వ తేదీన తిరుప్పూర్ జిల్లా పల్లడానికి విచ్చేయనున్నారు. దీంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ ఏడాదిలోనే రెండుసార్లు రాష్ట్రానికి ప్రధాని రావడంతో ఆ ఉత్సాహం రెట్టింపైంది. ప్రధాని మోదీ తమిళం, తమిళనాడు ప్రజలపై ఎంతో అభిమానం చూపిస్తుంటారు. ఆయన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మణినగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా, తమిళులు అధికంగా వున్న నియోజకవర్గంగా పేరుగాంచింది. కాశీ తమిళ సంగమం, సౌరాష్ట్ర తమిళ సంగమాలు ప్రధాని నేతృత్వంలో జరుగుతున్నాయి. ఇటీవల సంక్రాంతి సందర్భంగా ఢిల్లీలో కేంద్రమంత్రి మురుగన్ ఇంట్లో జరిగిన పొంగల్ వేడుకలకు కూడా తమిళ సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. తిరుచ్చి విమానాశ్రయ విస్తరణ, స్థానిక నెహ్రూ స్టేడియంలో ఖేలో ఇండియా-2024 పోటీలను ప్రధాని ప్రారంభించారు. ఆ సందర్భంగా తిరుచ్చి శ్రీరంగం, రామేశ్వరం ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు, ధ్యానం చేసిన ప్రధాని, అగ్నితీర్థంలోని పుణ్యజలాలను అయోధ్య రామాలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన పాదయాత్ర ముగింపు సభ ఫిబ్రవరి 18వ తేది పల్లడంలో జరగనుంది. ఈ సందర్భంగా సుమారు 3 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ సభలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. అలాగే, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

నిర్భయంగా పెట్టుబడులు పెట్టండి

దేశంలోనే ద్వితీయ ఆర్థికపురోగమన రాష్ట్రం మాదే

స్పెయిన్ కంపెనీలకు సీఎం స్టాలిన్ పిలుపు



స్పెయిన్ పెట్టుబడిదారుల సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యూరోప్‌లో ఆర్థిక ప్రగతి సాధించిన నాలుగో దేశంగా పేరుగడించిన స్పెయిన్‌లాగే భారతదేశంలో ఆర్థిక ప్రగతిని సాధించిన రాష్ట్రాల్లో తమ రాష్ట్రం (తమిళనాడు) ద్వితీయ స్థానం కలిగి ఉందని, కనుక నిర్భయంగా పెట్టుబడులతో తరలివచ్చి కొత్త పరిశ్రమలను నెలకొల్పాలని ఆ దేశానికి పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరుగుతున్న పెట్టుబడిదారుల మహానాడులో మంగళవారం ఉదయం ఆయన ప్రసంగిస్తూ... ఇటీవల చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడులో అమెరికా, బ్రిటన్, సింగపూర్, జపాన్, కొరియా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జర్మనీ, డెన్మార్క్‌లకు చెందిన ప్రముఖ కంపెనీలు తమ రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే దిశగా పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయని చెప్పారు. ఆ దేశాలను ఆదర్శంగా తీసుకుని స్పెయిన్‌లోని పారిశ్రామికవేత్తలు తమిళనాడులో కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొస్తే వారికి అంతర్జాతీయ సదుపాయాలు కల్పిస్తామని భరోసా కల్పించారు. పెట్టుబడిదారుల మహానాడుకు 30 దేశాలకు చెందిన 100కు పైగా కంపెనీల ప్రతినిధులు విచ్చేసి రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కల్పిస్తున్న అనువైన పరిస్థితులను తెలుసుకుని విస్తుపోయారని స్టాలిన్ గుర్తు చేశారు. హ్యూండాయ్, టాటా, తదితర సంస్థలు ఇటీవల పెట్టుబడులను పెంచి వాణిజ్య విస్తరణ కార్యకలాపాలను చేపట్టాయని చెప్పారు. అంతరిక్షం, రక్షణ రంగం, వైద్యరంగం ఆహారం, నీటి శుద్ధీకరణ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కూడా తమ రాష్ట్రం అనువుగా ఉంటుందని ఆయన చెప్పారు. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వాహనాలు, తోలువస్తువులు కూడా తమ రాష్ట్రంలోనే అధికంగా ఉత్పత్తి అవుతున్నాయంటూ అందుకు సంబంధించిన వివరాలను ఆయన స్పెయిన్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఈ సదస్సులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మాధవరం నుంచీ దక్షిణాది జిల్లాలకు బస్ సర్వీసులు

ప్రారంభించిన మంత్రి శివశంకర్



బస్ సర్వీసును ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి శివశంకర్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైవాసుల కోసం మాధవరం బస్‌స్టేషన్ నుంచి దక్షిణాది జిల్లాలకు బస్ సర్వీసులు ఏర్పాటయ్యాయి. వీటిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కిళంబాక్కం కలైంజర్ శతజయంతి స్మారక బస్ టెర్మినల్ మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో పనిచేస్తోందన్నారు. దీంతో కోయంబేడు నుంచి దక్షిణాది జిల్లాలకు నడుపుతూ వచ్చిన బస్సుల్లో 80 శాతం బస్సులు కిళంబాక్కం నుంచి, 20 శాతం బస్సులు మాధవరం బస్‌స్టేషన్ నుంచి నడుపుతున్నామని చెప్పారు. ఉత్తర చెన్నైవాసులు దక్షిణాది జిల్లాలకు వెళ్లేందుకు ఇబ్బందులకు పడుతున్నట్టు గుర్తించడంతో మాధవరం బస్‌స్టేషన్ నుంచి 20 శాతం సర్వీసులను నడుపుతున్నట్టు చెప్పారు. మాధవరం నుంచి తిరుచ్చికి 18 ట్రిప్పులు, సేలం నగరానికి 17 ట్రిప్పులు, విరుదాచలంకు 6 ట్రిప్పులు, కళ్లకురిచ్చికి 16, విల్లుపురానికి 16, కుంభకోణంకు 14, చిదంబరానికి 5, నైవేలికి 11, పుదుచ్చేరిమీదుగా కడలూరుకు 5 ట్రిప్పులు చొప్పున ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్‌లను నడుపుతామన్నారు. ఇదే విధంగా దిండివనానికి 10 ట్రిప్పులు, సెంజి మీదుగా తిరువణ్ణామలైకి 23 ట్రిప్పులు, పోలూరు, వందవాసికి 20 ట్రిప్పులు చొప్పున మొత్తం 160 ట్రిప్పులు నడుపుతామన్నారు. ఇక తిరుపతి క్షేత్రానికి మాధవరం బస్‌స్టేషన్ నుంచి ఎప్పటిలాగే 90 ట్రిప్పులు చొప్పున బస్సులు నడుపుతామన్నారు. ఇక కిళంబాక్కం నుంచి ప్రస్తుతం కోయంబేడుకు ప్రతి ఐదు నిమిషాలకు ఒక ఎంటీసీ బస్సు నడుపుతున్నామని మంత్రి చెప్పారు. తిరువాన్మియూరు నుంచి షోళింగనల్లూరు, శిరుచేరి ప్రాంతాలకు కూడా బస్సులు నడుపుతున్నామని ఆయన తెలిపారు. కోయంబేడు బస్‌స్టేషన్‌కు నగరం నలుమూలల నుండి సిటీ బస్సులను ఎలా నడుపుతున్నారో, అదే విధంగా కిళంబాక్కం బస్ టెర్మినల్‌కు కూడా వీలైనన్ని సిటీ బస్సులను నడుపుతున్నామని మంత్రి వివరించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో కిళంబాక్కం బస్‌స్టేషన్ పనులు మందకొడిగా జరిగాయని, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పనులను నిలిపివేయకుండా మరిన్ని నిధులు కేటాయించి విమానాశ్రయాన్ని తలపించే రీతిలో బస్ టెర్మినల్‌ను నిర్మించామన్నారు. కొత్తగా బస్‌స్టేషన్ ప్రారంభించినప్పుడు దూరం ఒక సమస్యగా భావించడం మామూలేనని, కోయంబేడ్‌లో బస్‌స్టేషన్‌ను ప్రారంభించినప్పుడు కూడా ఇలాంటి సమస్యలు ఎన్నో ఎదురయ్యాయని గుర్తు చేశారు. ఆ తర్వాత సిటీ బస్సులు అందుబాటులోకి రావటంతో దూరం సమస్యగా లేదన్నారు.

శ్రీవారిసేవలో ఈపీఎస్



తిరుమల శ్రీవారిని మంగళవారం మాజీ సీఎం, ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి దర్శించుకున్నారు. ఈ మేరకు ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే అష్టదళపాదపద్మారాధన సేవలో పళనిస్వామి పాల్గొన్నారు.

- తిరుమల

జాక్టో-జియో రాస్తారోకోతో దద్దరిల్లిన మదురై

● 500 మంది అరెస్టు



మదురైలో రాస్తారోకో నిర్వహిస్తున్న జాక్టో-జియో సభ్యులు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని జాక్టో-జియో సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాతో మదురై నగరం దద్దరిల్లింది. ఉపాధ్యాయులు, ఉద్యోగులు కార్యాచరణ మండలి సభ్యులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేయడంతో మదురై పెరియార్ బస్‌స్టేషన్ ప్రాంతం మారుమోగింది. అంతేగాక రాస్తారోకో కారణంగా రాకపోకలు స్తంభించాయి. కట్టబ్రహ్మన విగ్రహం కూడలి వద్ద జాక్టో-జియో సమన్వయకర్త సెల్వం నాయకత్వంలో మహిళలు సహా 500 మంది ఆందోళనలో పాల్గొన్నారు. ఆ తర్వాత ప్రధాన రహదారిపై రాస్తారోకో జరిపారు. ఎన్నికల సమయంలో డీఎంకే ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పాత పింఛన్ పథకాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 30 శాతం ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, 21 నెలల వేతనాల పెంపు నగదు మొత్తాన్ని చెల్లించాలని, స్థానిక సంస్థల్లో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలను భర్తీ చేయకూడదని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను చేపట్టినట్టుసెల్వం తెలిపారు. పోలీసులు జోక్యం ఆందోళనను విరమించాలని కోరగా ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రాస్తారోకో జరుపుతున్న 500 మందిని అరెస్టు చేసి వ్యాన్లలో తరలించారు. ఫిబ్రవరి 5 నుండి 9 వ తేదీ వరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులను కలుసుకుని తమ ఆందోళనకు మద్దతు కోరనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 10న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 15న రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమ్మె చేయనున్నట్టు సెల్వం పేర్కొన్నారు.

చెన్నైలో 200 మంది అరెస్టు...

చెన్నైలో మంగళవారం ఉదయం జాక్టో-జియో ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సుమారు 200 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. నుంగంబాక్కంలోని పాఠశాలల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు జాక్టో-జియో నాయకులు, సభ్యులు ప్రయత్నించారు. దీనికి పోలీసులు అనుమతించలేదు. అయినా మంగళవారం ఉదయం 9గంటలకల్లా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్టుండి కార్యాలయం వద్ద రహదారిపై బైఠాయించారు. అప్పటికే ఆ ప్రాంతంలో సిద్ధంగా ఉన్న పోలీసులు ధర్నా నిర్వహించేందుకు అనుమతి లేదంటూ జాక్టో-జియో నాయకులు వెంకటేశన్, మాయవన్ సహా 200 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశన్ మాట్లాడుతూ ... తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ధర్నా జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం గర్హనీయమన్నారు., ఫిబ్రవరి మొదటి వారం నుండి తమ ఆందోళనను తీవ్రతరం చేయనున్నట్టు ప్రకటించారు.



నుంగంబాక్కంలో నినాదాలు చేస్తున్న జాక్టో-జియో నాయకులు - నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కనులపండువగా త్యాగరాజ ఆరాధన

● పంచరత్న కీర్తనల ఆలాపనతో సంగీతాంజలి



పంచరత్న కీర్తనలను ఆలపించి తెలుగు వాగ్గేయ చక్రవర్తి త్యాగయ్యకు సంగీతాంజలి ఘటిస్తున్న మేటి కర్ణాటక సంగీత దిగ్గజాలు, కళాకారులు - తిరువయ్యారు నగర వీధుల్లో ఊరేగుతున్న వాగ్గేయ చక్రవర్తి త్యాగయ్య

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా తిరువయ్యారు కావేరి నదీతీరంలోని వాగ్గేయ చక్రవర్తి త్యాగయ్య సంస్మరణ స్థలం వద్ద మంగళవారం ఉదయం పంచరత్న కీర్తనాలాపాన అత్యంత వైభవంగా జరిగింది. కర్ణాటక సంగీత దిగ్గజాలతోపాటు సుమారు వెయ్యిమంది కళాకారులు ఒకే సమయంలో సామూహికంగా సంగీతాంజలి ఘటించి శ్రోతలను మైమరిపించారు. కర్ణాటక సంగీత వాగ్గేయకారత్రయంలో సుప్రసిద్ధులైన త్యాగరాజ స్వామి నాదోపాసన ద్వారా భగవంతుడిని దర్శించగలమని నిరూపించిన గొప్ప వాగ్గేయకారుడు. శ్రీరామభక్తాగ్రేసరుడైన త్యాగయ్య ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తెలుగు వాగ్గేయ చక్రవర్తి. భరతజాతికి చిరస్మరణీయుడై భారత, భాగవత, రామాయణ కావ్య సారాంశాలను ఔపాసన పట్టి, తన మధుర సంగీత, సాహిత్య రసభావంతో తత్త్వ భక్తి, వేదాంత, దార్శనిక శాంతి విషయాలను తన కృతుల ద్వారా ఎలుగెత్తి చాటారు. కర్ణాటక సంగీతంలో శాశ్వతమైన కీర్తిని సంపాదించిన త్యాగయ్య జయంతిని భారతీయ సంగీత దినోత్సవంగా భారతీయులు ఘనంగా జరుపుకుంటున్నారు. అదే రీతిలో ఈ సంగీత నిధికి నివాళిగా ప్రతియే పుష్య బహుళ పంచమి దినాన తంజావూరు జిల్లా తిరువయ్యారులోని ఆయన సమాధి వద్ద త్యాగరాజ ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఈనెల 26న 177వ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆ వేడుకల చివరి రోజైన మంగళవారం ఉదయం త్యాగరాజస్వామి సంస్మరణ స్థలం వద్ద పంచరత్న కీర్తనల ఆలాపాన కార్యక్రమం నిర్వహించారు.

త్యాగయ్య ఊరేగింపు: మంగళవారం ఉదయం 6గంటలకు తిరువయ్యారు తిరుమంజన వీధిలో ఉన్న త్యాగయ్య నివసించిన నివాసగృహం నుండి ఊంఛవృత్తి భజనలతో ఆయన విగ్రహన్ని ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ ప్రధాన వీధులలో త్యాగయ్య విగ్రహాన్ని ఉత్సవాల వేదిక వద్దకు చేర్చారు. ఆ తర్వాత పంచరత్న కీర్తనలతో త్యాగయ్యకు సంగీతాంజలి ఘటించే మహత్తర కార్యక్రమం ప్రారంభమైంది. కర్ణాటక సంగీత దిగ్గజాలు సుధా రఘునాథన్, మహతి, తిరువనంతపురం బిన్ని కృష్ణకుమార్, కడలూరు జనని, శీర్గాళి శివచిదంబరం, అరుణ్, అరిద్వారమంగళం పళనివేల్, శ్రీముష్ణం రాజారావు సహా 1000 మంది సంగీత కళాకారులు, వాద్య కళాకారులు త్యాగరాజస్వామిని స్మరిస్తూ పంచరత్న కీర్తనలను ఆలపించారు. తొలుత నాట రాగం ఆదితాళంతో 'జగదానంద కారక' అనే కీర్తనను, ఆ తరువాత గౌళ రాగం, ఆదితాళంలో 'దుడుకు గల' కీర్తనను, ఆరభి రాగం, ఆదితాళంలో 'సాధించెనే..' అనే కీర్తనను, వరాళి రాగం ఆది తాళంలో 'కనకన రుచిరా' అనే కీర్తనను, చివరగా జనబాహుళ్యానికి అత్యంత పరిచయమైన శ్రీ రాగం, ఆదితాళంతో 'ఎందరో మహానుభావులు' అనే కీర్తనను వెయ్యిమంది కళాకారులంతా ఏకకంఠంతో స్వర జతులు త్రొటుపాటు కాకుండా శ్రావ్యంగా ఆలాపించి వాగ్గేయ చక్రవర్తి త్యాగయ్యకు సంగీతాంజలి ఘటించారు. ఆ తర్వాత సాయంత్రం వరకూ పలు సంగీత కార్యక్రమాలను జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దీపక్ జాకబ్, త్యాగబ్రహ్మ మహోత్సవ సభ నిర్వాహకులు పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు సిక్కల్ గురుచరణ్ సంగీత కచేరి జరిగింది. రాత్రి 8 గంటలకు ముత్యాల పల్లకీలో త్యాగరాజస్వామిని ఊరేగించారు. ఈ కార్యక్రమానంతరం నిత్యశ్రీ మహదేవన్ గాత్ర కచేరీ నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ఆంజనేయ ఉత్సవంతో ఈ వేడుకలు ముగిశాయి.

సార్వత్రిక సమరం వేళ కొలువుల పండుగ

జూన్ 9 గ్రూపు-4 రాత పరీక్ష ● 6,244 పోస్టుల భర్తీకి చర్యలు



టీఎన్‌పీఎస్సీ కార్యాలయం

అడయార్, జనవరి 30: మరో రెండు నెలల్లో దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం నిరుద్యోగ ఓటర్లను ఆకర్షించేందుకు గ్రూపు-4 ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది. మొత్తం 6,244 పోస్టులను భర్తీ చేయనుంది. ఇందుకోసం జూన్ 9న రాత పరీక్షను నిర్వహించనుంది. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరి తేదీని ఫిబ్రవరి 28గా నిర్ణయించింది. ఈ పోస్టులకు దాదాపు 20 లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) అంచనా వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోని ఖాళీలతో పాటు కొత్త ఉద్యోగాలను టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలోనే భర్తీ చేస్తున్నారు.

భారీ సంఖ్యలో దరఖాస్తులు...

ఉద్యోగాలను గ్రూపు-1, 2, 3, 4 విభాగాలుగా విభజించారు. ఇందులో గ్రూపు-4 పోస్టులకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తుంటాయి. దీనికి కారణం... ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందు కనీస విద్యార్హత పదో తరగతి కావడమే. పైగా ఒకే ఒక రాతపరీక్ష, మార్కుల ఆధారంగా ఈ ఉద్యోగాలను భర్తీ చేస్తుంటారు. గ్రూపు-4 కిందకు మొత్తం 11 రకాలైన ప్రభుత్వ ఉద్యోగ కేటగిరీలు వస్తాయి. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా మహమ్మారి కారణంగా టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదు. అయితే, 2022లో జూలై 24న 10,117 పోస్టుల భర్తీకి గ్రూపు-4 రాతపరీక్ష నిర్వహించి, గత యేడాది మార్చి 24న ఫలితాలను వెల్లడించారు. కానీ, అనివార్య కారణాలతో భర్తీ చేయలేదు. ఈ నేపథ్యంలో తాజాగా 6,244 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించి, జూన్ 9వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పోస్టులకు జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 108 వీఏవో, టైపిస్ట్ 1705, షార్ట్‌హ్యాండ్ 448, ఫారెస్ట్ గార్డ్స్ 171, డ్రైవింగ్ లైసెన్స్‌తో కూడిన ఫారెస్ట్ ఆఫీసర్ పోస్టులు 192 ఇలా అనేక కేటగిరీల్లో పోస్టులను భర్తీ చేయనున్నారు.

సమాచార ధ్వని

ఇకపై తమిళంలో సర్టిఫికెట్లు

ఐసిఎఫ్, జనవరి 30: రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఇకపై తమిళంలోనే సర్టిఫికెట్లు పొందవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఆధారంగా నియామకాలు పొందేందుకు తమిళ మాధ్యమంలో విద్యనభ్యసించినట్లు సర్టిఫికెట్ పొందగోరువారు, తాము చదివిన కళాశాల మూసివేసివుంటే సంబంధిత విశ్వవిద్యాలయంలో పొందవచ్చని ప్రభుత్వ ప్రకటించింది.

విద్యుదుత్పత్తి నిలిపివేత

ఐసిఎఫ్, జనవరి 30: తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళంలో వున్న కేంద్రప్రభుత్వ అణు విద్యుత్ కేంద్రంలో ఇంధనాన్ని నింపే పనుల కారణంగా ఉత్పత్తి నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ తలా వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతుండగా రాష్ట్రానికి ప్రతిరోజూ వెయ్యి మెగావాట్ల విద్యుత్తు కేటాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొదటి యూనిట్‌లో ఇంధనం నింపే పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ఉత్పత్తి ఏప్రిల్ 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

టీచర్ ఉద్యోగ కాలపరిమితికి ఆంక్షలు

ఐసిఎఫ్, జనవరి 30: విద్యా సంవత్సరానికి మధ్యలో పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులకు ఉద్యోగ కాలపరిమితి పొడిగించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆంక్షలు విధించింది. ఆ ప్రకారం రిటైర్ కానున్న ఉపాధ్యాయులకు పని చేసే పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులు లేనిపక్షంలో మాత్రమే విద్యా సంవత్సరం మొత్తం ఉద్యోగకాల పరిమితి పొడిగించాలని, లేనిపక్షంలో పొడిగించరాదని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

చెన్నైలో ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, జనవరి 30: నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 16 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆవడి పోలీస్ కమిషనర్ శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వెల్లివేడు పోలీస్‌స్టేషన్ నుంచి శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ లారెన్స్ ఎస్ఆర్ఎంసీ శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్‌గా, అక్కడున్న ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ వెల్లివేడు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అంబత్తూరు మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ మోహనవల్లి ఎస్ఆర్ఎంసీ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా,అక్కడున్న ఇన్‌స్పెక్టర్ రీనా అంబత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.వీరితోపాటు మొత్తం 16మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీచేస్తూ ఆవడి కమిషనర్ ఉత్తర్వులుజారీ చేశారు.

వండలూరుకు గుడ్లగూబలు, రాబందులు

ఐసిఎఫ్, జనవరి 30: జంతువుల పరస్పర మార్పిడి పథకం కింద ఉత్తరప్రదేశ్ నుంచి గుడ్లగూబలు, రాబందులు స్థానిక వండలూరు జూలాజికల్ పార్కుకు దిగుమతి అవుతున్నాయి. వాటికి బదులుగా ఇక్కడి నుంచి జింకలు, నిప్పుకోళ్లు తరలించారు. మొదటగా వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం ఎగుమతి, దిగుమతి చేసినట్లు అధికారులు తెలిపారు.

150 లోఫ్లోర్ బస్సులు

ఐసిఎఫ్, జనవరి 30: దివ్యాంగులు సులభంగా వినియోగించేలా 150 కొత్త లోఫ్లోర్ బస్సులు కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వ రవాణాశాఖ అధికారులు తెలిపారు. రూ.135.48 కోట్లతో కొనుగోలు చేయనున్న ఈ బస్సులను విల్లుపురం ప్రభుత్వ రవా ణా సంస్థకు 26, సేలం ప్రభుత్వ రవాణా సంస్థకు 16, కోయంబత్తూరు ప్రభుత్వ రవాణా సంస్థకు 38, మదురై ప్రభుత్వ రవాణా సంస్థకు 33, తిరునల్వేలి ప్రభుత్వ రవాణా సంస్థకు 17 బస్సుల చొప్పున కేటాయించనున్నట్లు తెలిపారు.

అప్రైజర్ శిక్షణ

ఐసిఎఫ్, జనవరి 30: స్థానిక ఈక్కాడుతాంగల్‌లో వున్న రాష్ట్ర ప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధిసంస్థలో బంగారునగల మదింపుదారుల(అప్రైజర్) శిక్షణ ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనుంది. ఈ శిక్షణలో బంగారం, రాగి, వెండి, ప్లాటినం వంటి లోహాల నాణ్యత గుర్తింపు, ఆకురాయి వినియోగ విధానం, బంగారు ధర నిర్ణయ విధానం, యాసిడ్ వినియోగం, తూనిక వివరాలు, నకిలీ నగల గుర్తింపు వంటి వాటిపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 044-222 52081 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చు.

పాల పదార్థాల విక్రయాల పెంపు : ఆవిన్

ఐసిఎఫ్, జనవరి 30: పాల పదార్థాల విక్రయాలను నెలకు రూ.50 కోట్లకు పెంచేందుకు ఆవిన్ సంస్థ నిర్ణయించింది. ప్రతి నెలా పాల పదార్థాల విక్రయాల ద్వారా రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్ల వ్యాపారాన్ని ఆవిన్ సంస్థ చేస్తోంది. అయితే త్వరలోనే వేసవి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ విక్రయాలను రూ.50 కోట్లకు పెంచాలని అధికారులు నిర్ణయించారు. పెరుగు, లస్సీ, ఐస్‌క్రీం, బాదంపాలు, కుల్ఫీ వంటి ఉత్పత్తుల విక్రయాలు నెలకు రూ.50 కోట్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ విక్రయాల పెంపుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించినట్లు ఆవిన్ వర్గాలు తెలిపాయి.

పర్యావరణ అనుమతులు కోరుతూ ఎయిమ్స్ దరఖాస్తు

పెరంబూర్, జనవరి 30: మదురై తోపూర్ సమీపంలో ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, పర్యావరణ అనుమతులు కోరుతూ దరఖాస్తు దాఖలైంది. స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీకి ఆసుపత్రి యజమాన్యం తరఫున దరఖాస్తు సమర్పించారు. 221 ఎకరాల్లో ఇన్, ఔట్ పేషంట్ల విభాగాలు, అత్యవసర చికిత్సా కేంద్రం, వైద్యకళాశాల, నర్సింగ్ కళాశాలలు, విద్యార్థినీ,విద్యార్థుల వసతిగృహాలు, సిబ్బంది క్వార్టర్స్ తదితరాలు ఏర్పాటు కానున్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 30: విద్యుత్ మార్గాల్లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది. **అంబత్తూర్:** టీఐ సైకిల్ కృష్ణాపురం, సీటీహెచ్ రోడ్డు, వినాయకపురం, రెడ్‌హిల్స్ ప్రాంతం, విజయ లక్ష్మీపురం, రాంనగర్ **పెరంబూర్:** కీళపాక్కం గార్డెన్, వాటర్ వర్క్స్, అయనావరం, ఠాగూర్ నగర్, అన్నానగర్, ఓ అండ్ ఎల్ బ్లాక్, ఐసిఎఫ్.

తాంబరం - నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైళ్ల పొడిగింపు

పెరంబూర్, జనవరి 30: తాంబరం - నాగర్‌కోయిల్ ప్రత్యేక రైళ్లను మార్చి 31వ తేది వరకు పొడిగిస్తూ దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం, నెం.06011 తాంబరం - నాగర్‌కోయిల్ ప్రత్యేక వారాంతపు రైలు ఫిబ్రవరి 5, 12, 19, 26, మార్చి 3, 10, 17, 24, 31 తేదీల్లో ఉదయం 8.05 గంటలకు తాంబరంలో బయల్దేరి రాత్రి 8.55 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.06012 నాగర్‌కోయిల్ - తాంబరం ప్రత్యేక వారాంతపు రైలు ఫిబ్రవరి 4, 11, 18, 25, మార్చి 3, 10, 17, 24, 31 తేదీల్లో సాయంత్రం 4.35 గంటలకు నాగర్‌కోయిల్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.10 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.

జాక్టో-జియో ఆధ్వర్యంలో రాస్తారోకో

400 మంది అరెస్ట్

వేలూరు, జనవరి 30: పాత పింఛన్ విధానం అమలు, కాంట్రాక్ట్ ఉద్యోగ నియామకాల రద్దు సహా పలు అంశాలను డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (జాక్టో-జియో) ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. ఇందులో భాగంగా వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలో చేపట్టిన ఆందోళనల్లో సుమారు 1,000 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఆందోళనకు సంఘ జిల్లా ఆర్గనైజర్లు డీడీ జోషి, ఎమ్.జయకాంతన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జనార్దనన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీ శేఖర్, కంప్యూటర్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జి.గోపి, ఉర్దూ భాష ఉపాధ్యాయుల సంఘం జనరల్ సెక్రటరీ మహమ్మద్ షానవాజ్, వ్యవసాయ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర సెక్రటరీ రామన్, జిల్లా ఆర్గనైజర్లు జి.శ్రీనివాసన్, ఆర్.శ్రీనివాసన్, జిల్లా ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు ఎంఎస్ సెల్వకుమార్, శంకర్, బాబు, ఇళంగో, అల్ఫోన్స్‌గిరి, వేలు, ధీనదయాళన్, సుమతి, స్నేహలత, మహేశ్వరి, రాజ్‌కుమార్, వేందన్, విజయన్, తమిల్‌సెల్వన్, సుందర్, కోటీశ్వరన్, పాండ్యన్, జోసఫ్, రంజిత్, దయాల్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 400 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, అలమేలురంగాపురంలోని ప్రైవేటు కల్యాణ మండపానికి తరలించారు.



రాస్తారోకోలో జాక్టో-జియో సభ్యులు

కోయంబేడులో హంగులతో హరిత ఉద్యానవనం

● మంత్రి పీకే శేఖర్‌బాబు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియ

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కిళంబాక్కం బస్ టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసినట్లే కోయంబేడు బస్ స్టేషన్ వద్ద కూడా ఫౌంటైన్లతో భారీ హరిత ఉద్యానవనాన్ని నిర్మించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సీఎండీఏ ఇన్‌చార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో పుళియంతోపులోని ఉర్దూ బాలికల పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దేవాదాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో టీఎన్‌పీఎస్‌సీ ద్వారా ఎంపికైన ఉద్యోగులకు నియామక పత్రాలు అందించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కిళంబాక్కం బస్ టెర్మినల్ వద్ద పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తామని, అలాగే రైల్వే స్టేషన్ నిర్మించేందుకు రూ.20 కోట్లను రైల్వేశాఖకు అందజేశామని తెలిపారు. అదే విధంగా రూ.120 కోట్లతో కాలినడక ఫ్లైఓవర్‌ను నిర్మించబోతున్నామని చెప్పారు. కోయంబేడు బస్‌స్టేషన్‌ను ప్రారంభించినప్పుడు అన్ని బస్సులను ఆ చోటు నుండి నడిపేందుకు ఆరేళ్ల పట్టిందని, అయితే కిళంబాక్కం బస్‌టెర్మినల్ ప్రారంభించిన నెల రోజులకే అన్ని బస్సులను పూర్తి స్థాయిలో నడుపుతుండటం సంతోషంగా ఉందన్నారు. నెల రోజుల్లోగా ఆమ్నీ బస్సులన్నీ కిళంబాక్కం నుంచే నడిచేలా చర్యలు తీసుకుంటున్నామని శేఖర్‌బాబు తెలిపారు.

మంత్రి సెంథిల్ బాలాజీ పిటిషన్‌పై ఈడీకి నోటీసులు

పెరంబూర్, జనవరి 30: చట్టవ్యతిరేక నగదు బట్వాడా కేసులో అరెస్టయిన మంత్రి సెంథిల్ బాలాజీ బెయిలు కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ విచారించారు. చిన్న ఉద్యోగి అరెస్టయిన 48 గంటల్లో సస్పెండ్ చేస్తారు. కానీ, సెంథిల్ బాలాజీ అరెస్టయి 230 రోజులు దాటినా ఇంకా మంత్రిగా ఎందుకున్నారు? చట్టం అందరికీ సమానమే అంటూ, బెయిలు పిటిషన్ పరిశీలిస్తే గతంలో ఉన్న పరిస్థితిలో మార్పులేదని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. సెంథిల్ బాలాజీ బెయిలు పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేయాలని ఈడీకి నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ ఫిబ్రవరి 14వ తేదీకి వాయిదా వేశారు.

7న రవాణా కార్మిక సంఘాలతో చర్చలు

పెరంబూర్, జనవరి 30: ప్రభుత్వ రవాణా కార్మిక సంఘాలతో ఫిబ్రవరి 7వ తేది మూడో విడత చర్చలు జరపనున్నట్లు అధికారులు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లింపు, ఖాళీ పోస్టుల భర్తీ, కారుణ్య ప్రాతిపదికన వారసులకు ఉద్యోగాలు, వేతన పెంపుపై చర్చలు తదితర డిమాండ్లతో ఈనెల 9వ తేది రవాణా కార్మిక సంఘాలు సమ్మె చేపట్టాయి. అనంతరం హైకోర్టు ఉత్తర్వులతో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమ్మె విరమిస్తున్నట్లు కార్మిక సంఘాలు ప్రకటించాయి. కార్మిక సంక్షేమ శాఖ అధికారులతో రవాణా కార్మిక సంఘాలు జరిపిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో, తదుపరి చర్చలు ఫిబ్రవరి 7వ తేది జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్చల్లో తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తుందనే నమ్మకం ఉన్నట్లు కార్మిక సంఘాల సమాఖ్య నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.



చెన్నై సాలిగ్రామంలోని దివంగత డీఎండీకే నేత విజయకాంత్ నివాసగృహానికి వెళ్ళి ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి, ఆమె తల్లి రాజాత్తి అమ్మాళ్



చెన్నై కోట్టూరుపురం అన్నాశతజయంతి గ్రంథాలయం హాలులో 'కళల ఉత్సవం' పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బిల్‌మహేష్ పొయ్యామొళి

రాష్ట్రంలో 11.4 శాతం పెరిగిన అవయవదానాలు

పెరంబూర్, జనవరి 30: రాష్ట్రంలో అవయవదాతల సంఖ్య 11.4 శాతానికి పెరిగినట్లు, అదే సమయంలో 7,037 మందికి అవయవాలు అవసరమవుతున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదాలు, అగ్నిప్రమాదంలో గాయపడిన బాధితులకు దెబ్బతిన్న అవయవాలను ఇతరుల నుంచి సేకరించిన అమర్చి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. ఆసుపత్రిలో అవయవాలు అవసరమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేలా రాష్ట్రప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మెదడు నిర్జీవమైన వ్యక్తులు అవయవదానాలు చేస్తే, వారికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని ప్రభుత్వ ప్రకటించింది. అలా, అవయవాలు దానం చేసిన వారి భౌతికకాయాలకు రాష్ట్ర మంత్రులు, కలెక్టర్ల నివాళి అర్పించి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కిడ్నీ అవసరమైన వారు 6,322 మంది, కాలేయానికి 438 మంది, గుండె మార్పిడికి 76 మంది, శ్వాసకోశాల మార్పుకు 64 మంది, గుండె మార్పిడికి 27 మంది, చిన్న పేగు మార్పిడికి ఇద్దరు, కిడ్నీ, కాలేయ మార్పిడికి 40 మంది ఆసుపత్రుల్లో వేచి ఉన్నట్లు వైద్యుల తెలిపారు.

ఎంఎన్‌ఎం ఎన్నికల కార్యాచరణ సమన్వయ కమిటీ

పెరంబూర్, జనవరి 30: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కార్యాచరణ కమిటీని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) ఏర్పాటు చేసింది. ఏజీ మౌర్య, ఆర్.తంగవేలు, ఎ.అరుణాచలం తదితరులతో ఏర్పాటైన కమిటీ, ఎన్నికల పనులను సమన్వయ పరచయడం, కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయడం తదితరాలు పర్యవేక్షిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు కమలహాసన్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

నేడు మంత్రి పొన్ముడిపై ఉన్న ఎర్రమట్టి క్వారీ కేసు విచారణ

పెరంబూర్, జనవరి 30: మాజీ మంత్రి పొన్ముడిపై ఉన్న ఎర్రమట్టి క్వారీ కేసు విచారణ విల్లుపురం జిల్లా సెషన్స్ కోర్టులో జరుగుతోంది. సోమవారం ఈ కేసు విచారణకు రాగా, జయచంద్రన్, గోపినాథ్, సదానందన్ తదితర ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. మాజీ మంత్రి పొన్ముడి, ఎంపీ గౌతం శిఖామణి, రాజమహేంద్రన్, కోదకుమార్ తదితర నలుగురు గైర్హాజరయ్యారు. వారు రాకపోవడానికి కారణాలను డీఎంకే న్యాయవాదులు పిటిషన్‌గా దాఖలు చేశారు. అలాగే, ఈ కేసుకు సంబంధించిన దస్తావేజులు విల్లుపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి కోర్టుకు తీసుకురావాలని కోరుతూ ఎంపీ గౌతంశిఖామణి, జయచంద్రన్, రాజమహేంద్రన్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లకు సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వానికి నోటీసు జారీ చేసిన న్యాయస్థానం, తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేసింది.

నేడు అన్నాడీఎంకే బహిరంగ సభ

పెరంబూర్, జనవరి 30: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ జయంతి సందర్భంగా ఉత్తర చెన్నై ఈశాన్య జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్న పార్టీప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, 10,107 మందికి సంక్షేమ సహాయాలు అందజేయ నున్నారు.ఈ బహిరంగసభ ఏర్పాట్లపై జిల్లాకార్యదర్శి ఆర్ఎస్‌రాజేష్ కోర్టును ఆశ్రయించి అనుమతులుపొందడం గమనార్హం.

నేడు, రేపు మెరీనా తీరానికి దగ్గరగా కోస్ట్ గార్డ్ నౌకలు

పెరంబూర్, జనవరి 30: భారత నావికాదళం 48వ రైజింగ్ డే సందర్భంగా స్థానిక మెరీనా, ఎలియట్స్ సముద్రతీరానికి దగ్గరగా ఐసీజీ నౌకలు దర్శనమివ్వనున్నాయి. ఈ సందర్భంగా కోస్ట్‌గార్డ్‌కు చెందిన రెండు హెలికాప్టర్లు, ఆరు నౌకల ద్వారా విన్యాసాలు ప్రదర్శించనున్నారు. సముద్రంలో గల్లంతైన వారిని రక్షించే మాక్ డ్రిల్ కూడా ఉంటుందని, ప్రజలు ఈ కార్యక్రమాలను బుధ, గురువారాల్లో సూర్యాస్తమయం సమయంలో వీక్షించవచ్చని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి చెన్నై - అయోధ్య విమాన సేవలు

పెరంబూర్, జనవరి 30: చెన్నై నుంచి అయోధ్యకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రోజువారీ విమానసేవలు ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో చెన్నై సహా ముంబై, బెంగళూరు, అహ్మదాబాద్, జైపూర్ తదితర నగరాల నుంచి శుక్రవారం నుంచి నడపనున్న రోజువారీ విమాన సేవలను కేంద్ర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ప్రారంభించనున్నారు.

కొడనాడు ఎస్టేట్ హత్య, దోపిడీ కేసు

విచారణకు ఈపీఎస్ గైర్హాజరు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పాత్రికేయుడు మేథ్యూ సామ్యుయేల్ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ విచారణకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) గైర్హాజరయ్యారు. కొడనాడు ఎస్టేట్, హత్య, దోపిడీ కేసులతో తనకు సంబంధం ఉన్నట్లు పాత్రికేయుడు మేథ్యూ సామ్యుయేల్, ఆ కేసు ప్రధాననిందితులపై 2019లో ఈపీఎస్ హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాలను నమోదు చేసే బాధ్యతను హైకోర్టు ప్రాంగణంలోని మాస్టర్ కోర్టుకు అప్పటించారు. అయితే ఆ మాస్టర్‌కోర్టులో సాక్ష్యమిచ్చేందుకు ఈపీఎస్ అంగీకరించలేదు. దీవతో తన ఇంటి వద్దే సాక్ష్యం ఇచ్చేందుకు కోర్టు కమిషనర్‌ను నియమించాలని కోరారు. దాన్ని హైకోర్టు సింగిల్ జడ్జి అంగీకరించి న్యాయవాది కార్తిక్‌ను కోర్టు కమిషనర్‌గా నియమించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మేథ్యూ సామ్యుయేల్ ఇద్దరు న్యాయమూర్తులు కలిగిన ధర్మాసనంలో అప్పీలు చేసుకున్నారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తులు ఆర్.మహదేవన్, మహమ్మద్ సబీక్ ఈ నెల 30, 31 తేదీల్లోమాస్టర్ కోర్టులో హాజరై ఈపీఎస్ సాక్ష్యం చెప్పాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ప్రకారం మంగళవారం ఈపీఎస్ మాస్టర్ కోర్టులో విచారణకు గైర్హాజరయ్యారు.

నేటి నుంచి టీచర్ల బదిలీల కోసం కౌన్సెలింగ్

అడయార్, జనవరి 30: ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖకు చెందిన పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం నుంచి జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు అర్హులైన ఉపాధ్యాయుల వివరాలను డైరెక్టర్ అనుమతితో వెల్లడించాలని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా ఖాళీల వివరాలను కూడా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయం వెల్లడించాలని పేర్కొన్నారు.

ఇంటిపై పెట్రోల్ బాంబు దాడి

రౌడీ అరెస్ట్

పెరంబూర్, జనవరి 30: స్థానిక వాషర్‌మెన్‌పేటలో గంజాయి మత్తులో ఓ ఇంటిపై పెట్రోల్ బాంబ్ వేసిన రౌడీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర చెన్నై వాషర్‌మెన్‌పేట దేశీయనగర్ 6వ వీధికి చెందిన శివ ఇంటి సమీపంలో సోమవారం రాత్రి కొందరు యువకులు గంజాయి సేవిస్తుండగా, శివ అడ్డుకున్నట్లు సమాచారం. వారిలో మనోజ్ అనే యువకుడు శివను బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటి అనంతరం మళ్లీ అక్కడకు వచ్చిన వారు శివ ఇంటిపై పెట్రోల్ బాంబు వేసి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో మనోజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై ఇప్పటికే పలు స్టేషన్‌లలో 5 కేసులున్నట్లు తెలిపిన పోలీసులు, ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

నేమ్ బోర్డుల తయారీ షాపులో అగ్నిప్రమాదం

● రూ.20 లక్షల ఆస్తినష్టం

పెరంబూర్, జనవరి 30: స్థానిక ట్రిప్లికేన్‌లో నేమ్ బోర్డు తయారీ దుకాణంలో జరిగిన అగ్నిప్రమాదంలో భారీ ఆస్తి నష్టం జరిగింది. ఎల్లీస్ రోడ్డు యూవీ సైన్ డిజిటల్ డిజైన్ పేరుతో ఉన్న దుకాణంలో మంగళవారం ఉదయం దట్టమైన పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయాలనికి సమాచారం అందించారు. ఎగ్మూర్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలు శ్రమించి మంటలు అదుపుచేశారు. ఈ ఘటనలో రూ.15 లక్షల విలువైన డిజిటల్ మెషిన్, స్టిక్కర్లు అని మొత్తం రూ.20 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని దుకాణ యజమాని శంకర్ చెప్పారు. ఈమేరకు ట్రిప్లికేన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కరెంట్‌షాక్‌తో కార్మికుడి మృతి

పెరంబూర్, జనవరి 30: స్థానిక మాంగాడులో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. మాంగాడు బాలాజి అంబాళ్‌నగర్‌లో మనోహరన్ నూతన ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో, మనోహరన్ కుమారుడు విఘ్నేష్, కోలుమణివాక్కం గ్రామానికి చెందిన కార్మికుడు సోమసుందరం (60) ఇంటి పై భాగంగా దిష్టి బొమ్మ ఏర్పాటు చేసేందుకు మంగళవారం ఉదయం ప్రయత్నించారు. ఆ సమయంలో ఇంటి సమీపంలో వెళ్తున్న విద్యుత్ తీగ వారికి తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. చుట్టుపక్కల వారు వారిని వెంటనే కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక సోమసుందరం మృతిచెందాడు. ఈ ఘటనపై మాంగాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టి.నగర్‌లో వ్యభిచారం సాగిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెరంబూర్, జనవరి 30: స్థానిక టి.నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచార వృత్తి చేయిస్తున్న ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నార్త్ ఉస్మాన్ రోడ్డులోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు సోమవారం సాయంత్రం పోలీసులు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని తనిఖీలు చేసి వ్యభిచారం సాగిస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మున్నా కుమార్‌దాస్‌ను అరెస్ట్ చేసి, ముగ్గురు మహిళలను ప్రభుత్వ హోంకు తరలించారు.

భార్యాహంతకుడికి 45 యేళ్ళ జైలుశిక్ష

అడయార్, జనవరి 30: భార్యను, కుమారుడిని హత్య చేసిన కేసులో భర్తకు 45 యేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల అపరాధం విధిస్తూ చెన్నై మహిళా కోర్టు తీర్పునిచ్చింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పు వివరాలను పరిశీలిస్తే, వాషర్‌మెన్‌పేటకు చెందిన గుణసుందరి(28)కి అదే ప్రాంతానికి చెందిన మారితో వివాహమైంది. వీరికి మహేష్ కుమార్ (7) అనే కుమారుడు ఉన్నాడు. అయితే, మారి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సూళ్లూరుపేటకు చెందిన తమ బంధువు రాజు(36)ను 2014లో గుణసుందరి రెండో వివాహం చేసుకోగా, ఆమె గర్భందాల్చింది. అయితే, భార్య ప్రవర్తనను అనుమానించిన రాజు... ఆమెను, ఆమె కుమారుడిని హత్య చేశారు. దీనిపై వాషర్‌మెన్‌పేట పోలీసులు కేసు నమోదు చేయగా, చెన్నై మహిళా కోర్టు విచారణ జరిపి, తీర్పునిచ్చింది.

303 కిలోల గంజాయి స్వాధీనం

పెరంబూర్, జనవరి 30: స్థానిక మడిపాక్కంలో 303 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. 'డ్రైవ్ అగనెస్ట్ డ్రగ్స్' ప్రత్యేక గస్తీలో భాగంగా సోమవారం రాత్రి మడిపాక్కం కైవేలి జంక్షన్ రెండు కార్లను అడ్డుకున్న పోలీసులు, వాటిని పరిశీలించి బస్తాల్లో ఉంచిన 303 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో రంజన్ కిషోర్ కుమార్, ఒత్తాకన్ అశోక్, ఉదయకుమార్‌ను అరెస్ట్ చేశారు. వీరిలో కిషోర్‌పై హత్య సహా 8 కేసులు, అశోక్‌పై 16 క్రిమినల్ కేసులు, ఉదయకుమార్‌పై 13 క్రిమినల్ కేసులున్నట్లు పోలీసుల విచారణ తేలింది. ఈ వ్యవహారంలో గంజాయి సహా రెండు కార్లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు, మంగళవారం ఉదయం ముగ్గురిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

పెరంబూర్, జనవరి 30: తిరునల్వేలి జిల్లాలో మినీ బస్సు, మోటర్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. భవన నిర్మాణ కార్మికులు మాధవన్, అరుళ్ మంగళవారం పని ముగించుకొని మోటర్‌సైకిల్‌పై బయల్దేరారు. అంబాసముద్రం సమీపం శివందిపురం సమీపంలో వస్తున్న మోటరు సైకిల్‌ను మినీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వేలూరు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాలతి నేతృత్వంలో అంటరానితనం నిర్మూలన ప్రతిజ్ఞలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది



తాంబరం బస్‌స్టేషన్‌లో ప్రభుత్వ పథకాల వివరాలను ప్రసారం చేసే ఎల్ఈడీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు దామో అన్బరసన్, సామినాథన్



చెన్నై రాజాఅన్నామలైపురం క్రీడా మైదానంలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నిరోధక పనులను ప్రారంభిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్, మైలాపూరు ఎమ్మెల్యే డి. వేలు



చెన్నై వేప్పేరి సిగ్నల్ వద్ద గాంధీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటిస్తున్న పోలీసులు

కిళంబాక్కం బస్ టెర్మినల్‌లో

బస్సులు కదిలే ప్లాట్‌ఫాం నెంబర్లు ఇవే



అడయార్, జనవరి 30: నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన చర్యల్లో భాగంగా దక్షిణాది జిల్లాలకు వెళ్లే బస్సుల రాకపోకలు సాగించేందుకు కిళంబాక్కంలో కొత్తగా మఫిషల్ బస్టాండున ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. ప్రస్తుతం ఇక్కడి నుంచే దక్షిణ జిల్లాలకు వెళ్లే అన్ని బస్సులు బయలుదేరుతున్నాయి. అయితే, ఏ బస్సు ఏ ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరి వెళుతుందన్న అంశంపై ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. దీంతో సీఎండీఏ అధికారులు అధికారులు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ప్లాట్‌ఫాం 1: మార్తాండం, నాగర్‌కోయిల్, తూత్తుక్కుడి, తిరునెల్వేలి, సెంగోట్టై, కన్నియాకుమారి వైపు

ప్లాట్‌ఫాం 2: శ్రీవిల్లిపుత్తూరు, మార్తాండం, పాపనాశం, నాగర్‌కోయిల్, తూత్తుక్కుడి, తిరువనంతపురం, తిరునెల్వేలి, తిరుచ్చెందూరు, సెంగోట్టై, శివకాశి, కులశేఖరపట్టణం, ఉడన్‌కుడి ప్రాంతాలకు వెళ్లే బస్సులు.

ప్లాట్‌ఫాం 3: వీరచోళన్, మదురై, పరమకుడి, తొండి, దేవకోట, శివగంగై, సాయల్‌కుడి, కారైక్కుడి, కముది, ఏర్వాడి, రామేశ్వరం ప్రాంతాలకు...

ప్లాట్‌ఫాం 4: మన్నార్‌కుడి, బోడినాయగనూరు, పొల్లాచ్చి, పేరావూరణి, పట్టుకోట, తేని, తిరుచ్చి, దిండిగల్, తంజావూరు, కుంభకోణం, కరూర్ ప్రాంతాలకు..

ప్లాట్‌ఫాం 5: వేలాంకణ్ణి, మన్నార్‌కుడి, మైలాడుదురై, పేరావూరణి, పెరంబలూరు, పట్టుక్కోట, నాగపట్టినం, నన్నిలం, దురైయూర్, తిరువారూర్, తిరుచ్చి, తంజావూరు, కుంభకోణం, ఓరత్తనాడు ప్రాంతాలకు..

ప్లాట్‌ఫాం 6: మేట్టుపాళెయం, పొల్లాచ్చి, నామక్కల్, తిరువారూర్, తిరుప్పూరు, సేలం, కోయంబత్తూరు, గురువాయూర్, కరూర్, ఎర్నాకుళం, ఊటి, ఈరోడ్ ప్రాంతాలకు..

ప్లాట్‌ఫాం 7: వందవాసి, మేల్‌మలైయనూర్, విల్లుపురం, తిరుకోవిలూరు, దిండివనం, శంకరాపురం, కళ్ళకుర్చి, అరియలూరు ప్రాంతాలకు...

ప్లాట్‌ఫాం 8: జయంకొండాం, విల్లుపురం, తిరుక్కోవిలూరు, దిండివనం, శంకరాపురం, కళ్ళకుర్చి, అరియలూరు ప్రాంతాలకు..

ప్లాట్‌ఫాం 9: విరుదాచలం, వడలూరు, పుదుచ్చేరి, నైవేలి, దిట్టకుడి, చిదంబరం, కాట్టుమన్నార్‌కోయిల్, కడలూరు ప్రాంతాలకు బస్సులు బయలుదేరి వెళతాయి.


మమిత బైజు

తమిళ వెండితెరకు మరో మలయాళ బ్యూటీ

తమిళ చిత్రపరిశ్రమకు పలువురు కేరళ అమ్మాయిలు హీరోయిన్లుగా పరిచయమై ఇపుడు స్టార్ హీరోయిన్లుగా రాణిస్తున్నారు. ఆ కోవలో ఇపుడు మరో యువతి కోలీవుడ్ వెండి తెరకు పరిచయంకానున్నారు. ఆమె పేరు మమిత బైజు. మలయాళంలో పలు చిత్రాల్లో నటించిన మమిత... తమిళంలో 'రెబల్' చిత్రం ద్వారా ఎంట్రీ ఇవ్వనున్నారు. డెబ్యూ డైరెక్టర్ నికేష్ దర్శకత్వం వహించే ఈ చిత్రంలో హీరో జీవీ ప్రకాష్ కుమార్ సరసన నటించను న్నారు. ఇందులో కరుణాస్, సుబ్రమణ్య శివ, షాలు రహీం, వెంకటేష్ తదితరుల నటించారు. చివరి దశ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. ఫిబ్రవరి మూడో వారంలో విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నారు.

అవకాశాల కోసం భవానీశ్రీ ఎదురుచూపులు?

చిత్రజ్యోతి

'ఇదు ఎన్న మాయం', 'సిల సమయంగలిల్' వంటి పలు చిత్రాల్లో జూనియర్ ఆర్టిస్టుగా నటించిన భవానీశ్రీ... 'క.పా..రణసింగం' సినిమాలో హీరోయిన్ అవకాశాన్ని దక్కించుకున్నారు ఆ తర్వాత 'పావ కథైగల్' అనే అంథాలజీ సినిమాలో నటించారు. వెట్రిమారన్ 'విడుదలై' మూవీలో తమిళరసి క్యారెక్టర్‌లో నటించి మంచి నటిగా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. ప్రస్తుతం ఈ చిత్రం రెండో భాగంతో పాటు 'నన్బన్ ఒరువన్ వందపిరగు' అనే చిత్రాల్లో భవానీశ్రీ నటించారు. నిజానికి 'విడుదలై'లో తన పాత్రతో పాటు నటనకు మంచి మార్కులు, ప్రశంసలు వచ్చాయి. దీంతో ఇకపై వరుసగా అవకాశాలు వస్తాయని భావించారు. కానీ, ఆమె వద్దకు వచ్చిన కథలు సంతృప్తిగా లేకపోవడంతో నిరాకరించారు. ఇప్పుడు మంచి కథల్లో నటించేందుకు అవకాశాల కోసం ఎదురుస్తున్నారు. ఈ అమ్మడి ఎదురు చూపులు ఫలిస్తాయో లేదో వేచి చూడాలి.


భవానీశ్రీ


'చిక్‌లెట్స్'లో ఓ దృశ్యం

ఎల్లుండి విడుదలకు సిద్ధంగా 4 చిత్రాలు

కొత్త సంవత్సరంలోని మొదటి నెల జనవరి గడిచిపోయింది. రెండో నెల ఫిబ్రవరి మొదటి శుక్రవారం నాలుగు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో హాస్య నటుడు సంతానం నటించిన 'వడకుపట్టి రామస్వామి', విదార్థ్- పూర్ణ నటించిన 'డెవిల్', రక్షన్ హీరోగా నటించిన 'మరక్కుమా నెంజం', సాత్విక్ వర్మతో పాటు పలువురు కలిసి నటించిన 'చిక్‌లెట్స్' చిత్రాలున్నాయి. 'డిక్కిలోనా' వంటి విజయవంతమైన సినిమా తర్వాత సంతానం - కార్తీక్ యోగి కాంబినేషన్‌లో 'వడకుప్పట్టి రామస్వామి' రూపుదిద్దుకుంది. పూర్తి హాస్యభరిత సినిమాగా రూపుదిద్దుకోగా, మేఘాఆకాష్ హీరోయిన్‌గా నటించారు. ప్రముఖ దర్శకుడు మిష్కిన్‌ను సంగీత దర్శకుడిగా పరిచయం చేస్తూ తెరకెక్కిన చిత్రం 'డెవిల్'. మిష్కిన్ సోదరుడు ఆదిత్య దర్శకత్వం వహించారు. విదార్థ్, త్రిగుణ్, పూర్ణ, శుభశ్రీ ప్రధాన పాత్రలను పోషించారు. రక్షన్ హీరోగా నటించిన 'మరక్కుమా నెంజమ్' చిత్రం మలినా, రాహుల్ వంటి అనేక మంది నటించారు. ఇది ఒక స్కూల్ లైఫ్ లవ్ స్టోరీ. ముత్తు దర్శకత్వంలో సాత్విక్ వర్మ, జాక్ రాబిన్‌సన్, నయన్ కరిష్మా, అమృత హల్దార్ నటించిన చిత్రం 'చిక్‌లెట్స్'. 2కే కిడ్స్ రొమాన్స్ కథగా ట్రైలర్‌లోనే చూపించారు. గత యేడాదే విడుదల కావాల్సిన ఈ చిత్రం ఈ శుక్రవారం విడుదలకు సిద్ధమైంది.


'మరక్కుమా నెంజమ్'లో ఓ దృశ్యం

సినిమాల్లో మంచి విషయాలు చెప్పండి

● విజయ్ తండ్రి విన్నపం

సినీ దర్శకులకు అగ్రహీరో విజయ్ తండ్రి, సీనియర్ సినీ దర్శకుడు, నటుడు, నిర్మాత ఎస్.ఏ.చంద్రశేఖర్ ఒక విజ్ఞప్తి చేశారు. రెండున్నర గంటల సినిమాలో కనీసం మూడు నిమిషాలైన మంచి విషయాలను చెప్పాలని కోరారు. చెన్నైలో జరిగిన 'ఎలిల్-25' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ... 'ఆ కాలంలో పది తలలు నరికేవాడు విలన్. కానీ, నేడు ఆ పనిని హీరోతో చేయిస్తున్నారు. ఈ విభిన్నపోకడ ఏమిటో అర్థం కావడం లేదు. ఇలాంటి విషయాలను ఎలా అంగీకరిస్తున్నాం. నేటి యువత కూడా కత్తి పట్టుకుని పది మంది నరకమని సలహా ఇస్తున్నామా? ఎందుకంటే, నేటి యువత.. తమ అభిమాన హీరో ఎలాంటి చొక్కా ధరించారు? ఎలాంటి హెయిర్‌స్టైల్ పెట్టుకున్నారు? ఇలా ప్రతి అంశాన్ని నిశితంగా గమనిస్తున్నారు. దయచేసి.. మీ పాదాలకు నమస్కరించి చెబుతున్నా.. మంచి విషయాలతో సినిమాను తీయండి. రెండున్నర గంటల సినిమాలో కనీసం మూడు నిమిషాలైన మంచి విషయాన్ని ప్రేక్షకులకు చెప్పండి' అని విజ్ఞప్తి చేశారు.


ఎస్.ఏ.చంద్రశేఖర్

900 కిలోల కారును లాగిపారేశాడు

నడుముకు తాళ్లు కట్టుకుని ఏడేళ్ల బాలుడి సాహసం


కారు లాగుతున్న దేవసుగన్

పెరంబూర్, జనవరి 30: 'పిట్ట కొంచెం...కూత ఘనం' అన్న సామెతలా ఏడేళ్ల బుడతడు తాళ్లలో కారు లాగే సాధనలో రికార్డుల్లోకి ఎక్కాడు. శివగంగ జిల్లాకు చెందిన మోహన్‌రాజ్, మారీశ్వరి దంపతుల కుమారుడు దేవసుగన్ (7). సోమవారం ఆళియారు అరివుతిరుక్కోయిల్ సమీపం వాల్పారై రోడ్డులో నడుముకు తాళ్లు కట్టుకొని కారు లాగి చోళన్ ప్రపంచ రికార్డ్‌లో పేరు నమోదు చేసుకున్నాడు. 2 నిమిషాల 47 సెకన్లలో 220 మీటర్ల దూరానికి 900 కిలోల బరువు కలిగిన కారును లాగాడు. దేవసుగన్‌ను పలువురు అభినందించారు. ఈ విషయమై బాలుడి తల్లిదండ్రులు మాట్లాడుతూ... 2వ తరగతి చదువుతున్న దేవసుగన్, ఇదివరకే మదురైలో 200 మీటర్ల దూరం కారు లాగాడని, ప్రస్తుతం 220 మీటర్లు లాగాడని తెలిపారు. చిన్నవయసు నుంచే అందుకోసం శిక్షణ ఇప్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

1500 రేషన్ దుకాణాల్లో మోదీ సెల్ఫీ పాయింట్



ఐసిఎఫ్, జనవరి 30: రాష్ట్రంలో 1500 రేషన్ దుకాణాల్లో మోదీ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర సహకార, ఆహారశాఖకు కేంద్ర ఆహార శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉచిత బియ్యం పథకం ఈనెల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండడంతో ఉచిత బియ్యం పథకాన్ని ప్రజలకు తెలిసేలా దేశవ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ప్రధానమంత్రి ఫొటో ఉన్న సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోనూ 1500 రేషన్ దుకాణాల్లో ఈ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జమ్ము కశ్మీర్ లోయకు ఆవడి నుంచి ప్రత్యేక వాహనాలు


ఆవడిలో తయారైన ఎల్ఎస్వీ వాహనాలు

పెరంబూర్, జనవరి 30: దక్షిణ భారత సైనిక విభాగం ఆధ్వర్యంలోని ఆవడి కేంద్రంలో తయారైన ప్రత్యేక వాహనాలను జమ్ము కశ్మీర్‌కు తరలించారు. అక్కడి సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న భద్రతా దళాల ఉపయోగించడానికి అనుగుణంగా లైట్ స్పెషలిస్ట్ ఆర్మ్డు వెహికల్స్ (ఎల్ఎస్వీ)లను రూపొందించినట్టు అధికారులు చెప్పారు. ఇక వాటిని ప్రత్యేక వాహనాల్లో జమ్ము కశ్మీర్ లోయకు తరలించామని, సరిహద్దు భద్రతా దళాలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

ఆహారం కోసం వాహనాలను అడ్డుకున్న ఏనుగు



పెరంబూర్, జనవరి 30: ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల శరణాలయ పరిధిలోని ఆసనూరు అటవీ రేంజ్ పరిధిలోని అడవుల నుంచి సోమవారం సాయంత్రం ఓ ఏనుగు రోడ్డుపైకి వచ్చింది. ఆసనూరు - కేర్‌పాలెం రోడ్డుపైకి చేరుకున్న ఏనుగు ఆ మార్గంగా వెళుతున్న వాహనాలను అడ్డుకొని ఆహారం కోసం తొండంతో వాటి లోపల గాలించింది. దీన్ని గమనించిన వాహనచోదరకులు తమ వాహనాలను వెనుకకు నడుపుతూ వెళ్లారు. అయినా ఏనుగు ఆ వాహనాల వద్దకు వచ్చి గాలించింది. సుమారు గంటసేపు జరిగిన ఈ ప్రయత్నం అనంతరం ఏనుగు అడవిలోకి వెళ్లడం, గాలిస్తున్న సమయంలో వాహనాలను, వాటిలోని వ్యక్తులపై దాడి తదితరాలు చేయకపోవడంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.


చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల చేత అంటరానితనం నిరోధక ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ మేయర్ మహే‌ష్‌కుమార్

జాతిపిత గాంధీజీకి ఘననివాళి

● ప్రభుత్వాఫీసుల్లో అంటరానితనం నిరోధక ప్రతిజ్ఞ

● విగ్రహం వద్ద గవర్నర్, మంత్రుల పుష్పాంజలి ● ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద 2 నిమిషాల మౌనం

అడయార్, జనవరి 30: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మతసామరస్య దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఎగ్మోరులోని ప్రభుత్వ మ్యూజియంలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, మంత్రులు పీకే శేఖర్‌బాబు, స్వామినాథన్, మేయర్ ప్రియ పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, తిరువొత్రియూరు ఎమ్మెల్యేల ఐడ్రీమ్ మూర్తి, డీఐపీఏ డైరెక్టర్ టి.మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా,తేనాంపేటలోని అన్నా అరివాలయంలో రాష్ట్ర మంత్రులు ఉదయనిధి, కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, తంగం తెన్నరసు తదితరులు పాల్గొని నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మతసామరస్య ప్రతిజ్ఞ చేశారు. దేశం ఎదుర్కొంటున్న మతవిద్వేష ఫాసిస్ట్ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా మతాలకు అతీతంగా సమైక్యంగా, ఐకమత్యంతో జీవించాలని వారు పిలుపునిచ్చారు. మతసామరస్యానికి ప్రతీక అయిన మహాత్మా గాంధీని కొందరు మత విద్వేషకారులు దారుణంగా హత్య చేసిన జనవరి 30న రాష్ట్ర వ్యాప్తంగా మతసామరస్య దినోత్సవంగా పాటించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశించారు. దీంతో రాష్ట్ర రాజధానితో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ మతసామరస్య దినోత్సవాన్ని పాటించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద...

గాంధీజీ సేవలను గుర్తుకు తెచ్చుకునే విధంగా నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద మంగళవారం ఉదయం రెండు నిమిషాల పాటు మౌనం వహించి, అంజలి ఘటించారు. నగర పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ఈ ఏర్పాట్లు చేశారు. దీంతో నగరంలోని ప్రధాన రహదారి అన్నాసాలై స్పెన్సర్ సిగ్నల్, తేనాంపేట, ఓఎంఆర్, అడయార్, మెరీనా కామరాజర్ రోడ్డు, వడపళని, 100 ఫీట్ రోడ్డు, పూందమల్లి హైరోడ్డు ఇలా నగరంలోని ప్రధాన రహదారుల్లో సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు, వాహనచోదకులు మౌనం పాటించి, అంజలి ఘటించారు. ఇదే విధంగా చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద డిప్యూటీ మేయర్ మహే‌ష్‌కుమార్, కమిషనర్ డాక్టర్ జే రాధాకృష్ణన్ ఉద్యోగులతో అంటరానితనం నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగుల చేత పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ అంటరానితనం నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.

మత విద్వేషానికి వ్యతిరేకంగా పోరాడుదాం : వైగో

గాంధీ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశంలో నానాటికీ హెచ్చుమీరిపోతున్న మతవిద్వేష చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదామని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పిలుపునిచ్చారు. ఇదేవిషయంపై ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 1948 జనవరి 30న కొందరు మతవిద్వేషకారులు జాతిపిత గాంధీని కాల్చి చంపారని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తుకు చేసుకునే విధంగా ప్రతియేటా జనవరి 30వ తేదీన మతసామరస్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

మద్రాస్ హైకోర్టులో సరిగ్గా 11 గంటలకు...

భారతదేశ విముక్తి కోసం పోరాడి ప్రాణాలు విడిచిన త్యాగధనులను స్మరించుకునే విధంగా మద్రాస్ హైకోర్టులో స్మారక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అలాగే, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మతసామసర్య దినోత్సవం కూడా జరిపారు. ఇందులోభాగంగా, సరిగ్గా 11 గంటలకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, హైకోర్టు సిబ్బంది, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొని సరిగ్గా 11 గంటలకు రెండు నిమిషాల పాటు నివాళి అర్పించారు.



గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌లో ఉద్యోగుల చేత అంటరానితనం నిరోధక ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్


ఎగ్మూరు ప్రభుత్వ మ్యూజియం ప్రాంగణంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న గవర్నర్ రవి, మంత్రులు సామినాథన్, పీకే శేఖర్‌బాబు, కార్పొరేషన్ మేయర్ ఆర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహే‌ష్‌కుమార్ తదితరులు


రాయపేటలోని సత్యమూర్తిభవన్‌లో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి, గోపన్నా తదితర పార్టీ నాయకులు

రూ.80వేల కోట్లతో పీఎంకే వ్యవసాయ వార్షిక షాడో బడ్జెట్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమ పథకాలను విరివిగా అమలు చేసే దిశగా రూ.80వేల కోట్లతో పాట్టాలి మక్కల్ కట్చి వ్యవసాయ వార్షిక షాడో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నగరంలో మంగళవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నమూనా వ్యవసాయ బడ్జెట్ ప్రతిపాదనలను పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ విడుదల చేశారు. సాగుజలాల కోసం రూ.20 వేల కోట్లు, పంటల బీమా పథకానికి రూ.27,500 కోట్లు, వ్యవసాయ విద్య పరిశోధనలకు రూ.20వేల కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రత్యేకంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ అథారిటీని ఏర్పాటు చేయాలని, కబ్జాలకు గురైన 15వేల సరస్సులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సూచించింది. ఇక ఏప్రిల్ 6న వ్యవసాయ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించాలని పీఎంకే నిర్ణయించింది. అత్యుత్తమ సేవలందించే వ్యవసాయ పరిశ్రమలకు రూ.25లక్షల సబ్సిడీ ఇవ్వాలని, కావేరి - ధర్మపురి మిగులు నీటి ప్రాజెక్టు అమలు చేయాలని, మదురాంతం సరస్సు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని షాడో బడ్జెట్‌లో ప్రతిపాదించారు. క్వారీలన్నింటిని రద్దు చేసి పంటలకు సక్రమంగా సాగు జలాలను అందించాలని కూడా సూచించారు.


షాడో వ్యవసాయ బడ్జెట్‌ను విడుదల చేస్తున్న పీఎంకే నేతలు డాక్టర్ రాందాస్, డాక్టర్ అన్బుమణి రాందాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు శరత్‌కమల్

యేటా వందమందికి శిక్షణ

● శరత్‌కమల్ ప్రకటన

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్కే అకాడమీ ద్వారా యేటా ఐదేళ్లకు పైబడిన వయస్సు కలిగిన వందమంది బాలబాలికలకు టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ ఇస్తామని అదే సమయంలో 2028 ఒలంపిక్ క్రీడల్లో సునిశిత శిక్షణ పొందిన క్రీడాకారులను పాల్గొనేలా చేస్తామని ఆ అకాడమీ నిర్వాహకుడు, ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడకారుడు శరత్‌కమల్ పేర్కొన్నారు. సుప్రసిద్ధ టెన్నిస్ క్రీడా శిక్షణ సంస్థ ఎస్కే అకాడమీతో ఫైబర్ సిమెంట్ రూఫింగ్ షీట్ల తయారీ సంస్థ సహ్యాద్రి ఇండస్ట్రీస్, లక్ష్య సంస్థలు భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక నెహ్రూస్టేడియం టెన్నిస్ హాలులో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ సంస్థకు రెండు సంస్థలు ఆర్థిక తోడ్పాటును అందించడం సంతోషంగా ఉందన్నారు. సహ్యాద్రి ఇండస్ట్రీస్ ఎండీ సత్యన్‌పటేల్ మట్లాడుతూ యువ టేబుల్ టెన్నిస్ ఆటగాళ్ళకు ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తెలిపారు. వారి అభివృద్ధికి నిర్మాణాత్మక మార్గాన్ని అందిస్తామన్నారు. లక్ష్య సంస్థ కార్యదర్శి ఆశిష్ దేశాయ్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన యువకులకు టేబుల్ టెన్నిస్ కోచ్‌ల ద్వారా శిక్షణను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో మరో మేటి క్రీడాకారుడు రజత్‌కమల్ కూడా పాల్గొన్నారు.

విజేతల విజయగాథలను పఠించండి

● విద్యార్థులకు డాక్టర్ వేల్‌రాజ్ పిలుపు

అడయార్, జనవరి 30: జీవితంలో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహా నేతల గాథలకు చెందిన పుస్తకాలను చదవాలని విద్యార్థులకు అన్నా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.వేల్‌రాజ్ పిలుపునిచ్చారు. కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ 21వ స్నాతకోత్సవాలు ఆదివారం జరిగాయి. ఈ వేడుకల్లో 958 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. అలాగే, ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పతకాలతో పాటు నగదు బహుమతిని అందజేశారు. ఇందులో ఆర్.వేల్‌రాజ్ మాట్లాడుతూ... రానున్న రెండు దశాబ్దాల్లో దేశ యువతకు అపారమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అందువల్ల విద్యార్థులు తమలోని సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. అమ్మన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఆనంద్ సుందరేశన్, హిందుస్థాన్ గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ముత్తుకన్నన్, కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ అన్నీ జాకబ్, డీన్ (అకడమిక్స్) డాక్టర్ జి.ప్రభాకరన్, విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో డిగ్రీలు స్వీకరించిన విద్యార్థులు



డీఎంకే లోక్‌సభ ఎన్నికల సమన్వయకమిటీ సమావేశంలో మదురై నియోజకవర్గం నాయకులతో మాట్లాడుతున్న మంత్రి ఉదయనిధి

1న చెన్నైలో విద్యార్థుల ర్యాలీ

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి 1న నగరంలో విద్యార్థుల ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, మంత్రి ఉదయనిధి తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థి సంఘాల నాయకులు ఈ ర్యాలీలలో పాల్గొంటారని, ర్యాలీని పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి ప్రారంభిస్తారని చెప్పారు. డీఎంకే విద్యార్థి విభాగాలకు చెందిన 15వేల మంది ఈ ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు. స్థానిక రాబిన్‌సన్ పార్కు నుంచి ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు.